కాలుష్య కాసారం

- కుందూ నదిలో కలుస్తున్న నంద్యాల పట్టణ మురుగునీరు
- ఫ్యాక్టరీల వ్యర్థాలు కూడా..
- నది నీటినే తాగుతున్న దాదాపు 80 గ్రామాల ప్రజలు
- అనారోగ్యాలబారిన పడుతున్న నదీ తీర ప్రాంతాల జనం
- ఏళ్లుగా పట్టించుకోని యంత్రాంగం
- ప్రత్యామ్నాయ చర్యలూ శూన్యం
- మురికి కూపంలా మారిన నది

కుందూ నది.. నంద్యాల పట్టణంలోని మురుగు నీటితో కాలుష్య కాసారంలా మారింది. పట్టణంలోని, ఫ్యాక్టరీల నుంచి వ్యర్థాలు నదిలోకి వదులుతుండటంతో కలుషితమై తాగునీరు విషంగా మారింది. నదీ తీర ప్రాంతాల ప్రజలు ఆ నీటిని తాగి వ్యాధులబారిన పడుతున్నా సంబంధిత అధికారులు కనీసం ప్రత్యామ్నాయ మార్గాలు చూపకపోవడం విచారకరం. ఇక అండర్ డ్రైనేజీ కథ కంచికి చేరినా పట్టించుకునే నాథుడు లేక ఏటేటా నది మరింత ప్రమాదకరంగా తయారవుతోంది.



బైటిపేట వద్ద కుందూలో కలుస్తున్న మురుగునీరు

నంద్యాల(అర్బన్): కుందూనదిలో కలుస్తున్న వ్యర్థాలు అనర్థాలకు దారితీస్తున్నాయి. పట్టణ సమీపంలోనున్న ఆల్కాహాల్ ఫ్యాక్టరీ వ్యర్థాలు, పట్టణ మురుగునీరు నదిలో కలుస్తున్నాయి. దీంతో నదిలోని నీరు గరళంగా మారుతోంది. కుందూ పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు, పశుపక్షాదులు నది నీటిని తాగి అనారోగ్యాల పాలవుతున్నారు. కలుషిత నీరు కలువకుండా మార్గాలు చూపాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

కుందూ నది ప్రవహిస్తున్న మండలాలు..

నంద్యాల జిల్లాలోని పాలేరు, మద్దిలేరు, సంకలవాగు తదితర వాగులు పాయలుగా వస్తూ నంద్యాల సమీపంలో ఒకటైన ప్రాంతాన్ని కుందూ నదిగా పిలుస్తారు. నంద్యాల, గోస్పాడు, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, చాగలమర్రి, పెద్దముడియం, రాజుపాలెం తదితర ప్రాంతాల్లోని దాదాపు 80 గ్రామాల మీదుగా ఈ నది ప్రవహిస్తుంది.

పట్టణంలోని మురుగంతా నదిలోకే..

దాదాపు 8లక్షల జనాభా ఉన్న నంద్యాల పట్టణ మురుగు నీటిని మున్సిపల్ అధికారులు కుందూలో కలిపేస్తున్నారు. బాలాజీ కాంప్లెక్స్, శ్రీనివాసనగర్, చాంద్‌బాడ, టెక్కె తదితర ప్రాంతాల మురుగు నీరు పద్మావతి నగర్‌లోని ప్రధానకాల్వ నుంచి శ్యామకాల్వలోకి, పెద్దకొట్టాల గ్రామ సమీపం నుంచి వస్తున్న పాలేరు వాగు విశ్వనగర్, సాయిబాబానగర్, ఎన్‌జీఓస్ కాలనీల మీదుగా చామకాల్వ ద్వారా పట్టణంలోకి వస్తుంది. ఆ నీరు నూనెపల్లె, ఎన్‌జీఓ కాలనీ, సాయిబాబానగర్, వీసీ కాలనీ, దేవనగర్, రెవెన్యూ క్వార్టర్స్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీటితో చేరి ప్రథమనంది ఆలయ సమీపంలోని కుందూలో కలుస్తుంది. అలాగే.. బండిఆత్మకూరు పికప్ ఆనకట్ట వద్ద నుంచి మద్దిలేరు వాగు ద్వారా వస్తున్న నీరు నడిగడ్డ, ఆత్మకూరు బస్టాండు, ఫరూక్ నగర్, బైర్మల్‌వీధి, బైటిపేట, ప్రాంతాల్లోని మురుగు నీరు దళితపేట వద్ద కుందూలో కలుపుతుంది. దశాబ్దాలుగా పట్టణ మురుగునీరు కుందూలో కలుస్తూ కలుషితమవుతూనే ఉంది. అయితే కుందూలో వస్తున్న నీటినే నది పరివాహక ప్రాంతాల ప్రజలు తాగుతూ అనారోగ్యాల పాలవుతున్నారు. పట్టణ మురుగు నీటితోనే కుందూనది కలుషితమవుతుంటే నంద్యాల సమీపంలోని కర్నూలు–కడప జాతీయ రహదారిలో ఏర్పాటైన ఓ ఆల్కాహాల్ ఫ్యాక్టరీ ద్వారా వస్తున్న వ్యర్థాలు అందులో కలుస్తుండటంతో నీరు విషతుల్యమవుతుంది. ఎన్నో ఏళ్లుగా కుందూ తీర ప్రాంత ప్రజలు వ్యర్థాలు కలవడాన్ని వ్యతిరేకిస్తున్నా సంబంధిత అధికారులు, ప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

రోగాలబారిన జనం..

కలుషిత నీటిని వినియోగించుకుంటుండంతో నదీతీర ప్రజలు చర్మ, లివర్ సంబంధిత జబ్బులతో పాటు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. పట్టణ మురుగు నీరు కుందూలో కలువకుండా ఉండేందుకు గత ప్రభుత్వాలు పట్టణ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశాయి. కొన్ని ప్రాంతాల్లో పనులు పూర్తయినా నిధులు సరిపోకపోవడంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



శ్యామకాలువ నుంచి వెళ్తున్న మురుగునీరు

క్లుప్తంగా

పోలీసు బందోబస్తు మధ్య వేలాలు

చాగలమర్రి: స్థానిక పంచాయతీకి చెందిన వివిధ మార్కెట్లు, రూముల లీజుకు సంబంధించి వేలం పాటలను నంద్యాల డీఎల్‌పీఓ ఎన్. రాంబాబు సమక్షంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య పంచాయతీ సమావేశ భవనంలో ఈఓ ప్రకాశం గురువారం నిర్వహించారు. బస్టాండు, వారపు సంత, కమేళా, బండ్లమెట్ట, దిన మార్కెట్, మార్కెట్‌లోని 8 రూములు, 5 ప్లాట్‌ఫాంలు, కోటగడ్డ పంచాయతీలో రెండు రూములు ఏడాది పాటు లీజుకు ఇవ్వటానికి వేలాలు చేపట్టారు. ఇందుకు సుమారు 8 మంది ఉదయం డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. బస్టాండ్ రూ.6,35,000, వారపుసంత రూ.1,81,000కు, దినమార్కెట్–రూ.70,000, కమేళ–రూ.93,000 ,కోటగడ్డ వద్ద ఉన్న రెండు రూములు ఒక్కోటి రూ.812 పాటదారులు దక్కించుకున్నారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత నాయక్, ఎస్‌ఐ రమణయ్య బందోబస్తు కల్పించారు.

పాఠశాలలకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు



పాఠశాలలకు అందజేసిన పాఠ్యపుస్తకాలు

దొర్నిపాడు: మండలంలోని అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందజేసినట్లు ఎంఈఓ రామచంద్రయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మూడో విడత 2,165 పుస్తకాలు రావడంతో అన్ని పాఠశాలలకు అందజేసి వెంటనే విద్యార్థులు పంపిణీ చేయించినట్లు చెప్పారు. అలాగే షూ, బెల్టు, సాక్సులు, బ్యాగులు ఇచ్చామన్నారు. యూనిఫాం వచ్చిన వెంటనే అందజేస్తామన్నారు.

ఉపాధి పనులపై విచారణ

గోస్పాడు: తేళ్లపురి గ్రామంలో నిర్వహించిన ఉపాధి పనులపై పీడీ రామచంద్రారెడ్డి విచారణకు ఆదేశించారని ఏపీఓ నాగ జ్యోతి తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీ చేశారని, రికార్డులు సక్రమంగా నిర్వహించని, తప్పిదాలపై జరిమానాను సామాజిక తనిఖీ బృందం సభ్యులు నమోదు చేసిన మేరకు ఉన్నతాధికారులు తనిఖీ చేసి వాటిని రికవరీ చేశారన్నారు. అయితే తేళ్లపురి గ్రామంలో ఉపాధి పనులకు హాజరుకాని కూలీలకు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ కల్పన వేతనాలు అందజేసినట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వీటి ద్వారా రూ.47వేలు దాకా ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైందనే ఫిర్యాదుల నేపథ్యంలో పీడీ రికార్డులను పరిశీలించి అంబుడ్స్‌మెన్‌తో విచారణకు ఆదేశించారని వివరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్లుగా పదోన్నతి

ఉయ్యాలవాడ: మండలంలో ఉపాధిలో సీనియర్ మేటీలుగా విధులు నిర్వహిస్తున్న ముగ్గురికి ఫీల్డ్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించినట్లు ఏపీఓ రవిప్రకాష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సర్వాయిపల్లె, ఇంజేడు, ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో సీనియర్ మేటీలుగా విధులు నిర్వహిస్తున్న వెంకటకృష్ణ, ప్రసాద్‌రెడ్డి, ప్రసాద్‌రావుకు ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు కార్యాలయానికి అందాయని ఏపీఓ వివరించారు.

బ్యాగులు, బూట్లు మంజూరు

ఉయ్యాలవాడ : మండలానికి స్టూడెంట్ కిట్ కింద విద్యార్థులకు బ్యాగులు, బూట్లు, డిక్షనరీలు మంజూరయ్యాయని ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ బ్యాగులు 2077, బూట్లు 2077, 6వ తరగతి విద్యార్థులకు 167 డిక్షనరీలు వచ్చాయన్నారు. అలాగే 4వ విడతగా 2,268 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు 18,381 పాఠ్య పుస్తకాలు మండల స్టాక్ పాయింట్‌కు చేరగా వాటిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ద్వారా విద్యార్థులకు పంపిణీ చేశామన్నారు. స్టూడెంట్ కిట్‌లో భాగంగా యూనిఫాం దుస్తులు, పాఠ్యపుస్తకాలు 10వ తరగతి ఫిజికల్ సైన్స్‌తో పాటు ఇతర రకాలు 3,200 రావాల్సి ఉందని చెప్పారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

గోస్పాడు: ఎరువులు, పురుగు మందులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి స్వప్నికా రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని, కొనుగోలు చేసిన వారికి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి: ప్రజలు డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ముత్యాలపాడు పీహెచ్‌సీ వైద్యురాలు తస్లీమా సుల్తానా తెలిపారు. గురువారం మండలంలోని పెద్దవంగలి గ్రామంలో డెంగీ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ మనోహర్, ఎంఎల్‌హెచ్‌పీ కవిత పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడుకు చెందిన చాకలి పుల్లమ్మ (50) కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ సురేష్ గురువారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రానికి తాళం

- ప్రభుత్వం అద్దె చెల్లించినా.. యజమానికి ఇవ్వని కార్యకర్త

చాగలమర్రి: స్థానిక 4వ అంగన్‌వాడీ కేంద్రానికి 5 నెలల అద్దె చెల్లించలేదని ఇంటి యాజమాని కేంద్రానికి తాళం వేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. దీంతో అంగన్‌వాడీ కార్యాలయానికి వచ్చిన సహాయ కార్యకర్త గౌరితో పాటు చిన్నారులు బయట కూర్చోవలసి వచ్చింది. అద్దె చెల్లింపుపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మను వివరణ కోరగా.. ప్రభుత్వం ద్వారా నెలకు రూ.1500 చొప్పున 5 నెలలకు మొత్తం రూ.7,500లు చెల్లించామన్నారు. కార్యకర్త చెల్లించకపోవడంతో తాళం వేశారని చెప్పారు. ఇదిలా ఉండగా..అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం, గుడ్లు, పాలు తదితర వస్తువులు తమకు పంపిణీ చేయడం లేదని, ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి ఆహారం వండి పెట్టటానికి ప్రభుత్వం రెండు గ్యాస్ సిలిండర్లు మంజూరు చేసినా గ్యాస్ అయిపోయిందనే సాకుతో కొన్నిసార్లు అన్నం వండటం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా అంగన్‌వాడీ కార్యకర్త విధులకు హాజరు కాకుండా నిర్లక్ష్యం వహిస్తుందని చెబుతున్నారు. పౌష్టికాహారం ఎందుకు పంపిణీ చేయడం లేదని కార్యకర్తను ప్రశ్నించగా.. పై నుంచి రాలేదని, అయినా మీకవన్నీ ఎందుకు చెప్పాలని.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోపోండి అని బెదిరిస్తుందని లబ్ధిదారులు వాపోయారు.



అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసిన దృశ్యం

చికిత్స పొందుతూ మహిళ మృతి

శిరివెళ్ల: మండలంలోని మహదేవపురం గ్రామానికి చెందిన గులకచందనం వెంకటలక్ష్మి (35) చికిత్స పొందుతూ మృతి చెందిందని ఎస్‌ఐ సురేష్ గురువారం తెలిపారు. భర్త ఆంజనేయులు మద్యానికి బానిసై నిత్యం డబ్బుల కోసం భార్యను వేధించేవాడు. ఆ బాధలు తట్టుకోలేక ఈ నెల 3న రసాయన పొడిని నీటిలో కలుపుకొని సేవించింది. వైద్యం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందిందన్నారు. మృతురాలి తల్లి మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మిద్దెపై నుంచి పడి మహిళ మృతి

ఉయ్యాలవాడ: మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామానికి చెందిన అనకల సరస్వతి (60) ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడి మృతి చెందింది. గురువారం ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మృతురాలు మిద్దెపై కుక్కలు తిరుగుతుండటంతో వాటిని తరిమేందుకు బుధవారం మిద్దెపైకి వెళ్లింది. కిందకు దిగే క్రమంలో ప్రమాదశాత్తు కింద పడింది. చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. భర్త గోవిందరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

క్రీడల నిర్వహణపై సమావేశం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో క్రీడల నిర్వహణపై క్రీడాభారతి కార్యవర్గ సమావేశం స్థానిక సంకల్ప పాఠశాలలో కరస్పాండెంట్ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఈ నెలలో మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు ఫుట్‌బాల్, రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలు, రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు నిర్వహించేందుకు తీర్మానం చేశామన్నారు. ఈనెల 18, 19 తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు, 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడా భారతి భవిష్య నిధి కోసం రామకృష్ణారెడ్డి, సుధాకర్ రూ.50 వేల చొప్పున విరాళం ప్రకటించారు. అనంతరం క్రీడా భారతి అధ్యక్షుడు శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ మాట్లాడుతూ క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడంలో కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. అనంతరం ఎన్‌టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్న శివరామిరెడ్డిని సన్మానించారు. నిమ్మకాయల సుధాకర్, జాయింట్ సెక్రటరీ హేమంత్, బాలకృష్ణ, జ్యోత్స్న, మహేశ్వరి, సుబ్బారెడ్డి, రమణ, ఎల్లయ్య, గోపి పాల్గొన్నారు.



సమావేశమైన క్రీడా భారతి సభ్యులు

ఆర్థిక స్థిరత్వంతో అభివృద్ధి

నంద్యాల(సిటీ): ఆర్థిక స్థిరత్వంతో అభివృద్ధి సాధ్యమని ఏపీ ఆర్‌బీఐ జీఎం రాజేష్ కె మహాన అన్నారు. గురువారం పట్టణానికి విచ్చేసిన ఆయనను నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్థిరత్వం ఉంటే ప్రగతి సాధించవచ్చన్నారు. నవ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని కోరారు. పట్టణాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఆయనను కోరారు.



ఆర్‌బీఐ జీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్

హైకోర్టు ఏజీపీగా నేరెళ్ల ఎస్వీ రవితేజ



చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది చంద్రశేఖర్ కుమారుడు నేరెళ్ల ఎస్వీ రవితేజ ఏపీ రాష్ట్ర హైకోర్టు ఏజీపీగా ఎంపికయ్యారు. ప్రాథమిక విద్యను చాగలమర్రిలో అభ్యసించి, ఉన్నత విద్యను కర్నూలు, హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో, ఎల్‌ఎల్‌ఎం తదితర పీజీ కోర్సులను నల్సార్ యూనివర్సిటీలో పూర్తిచేశారు. 2015లో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యత్వం పొంది న్యాయవాద వృత్తిని చేపట్టారు. రాష్ట్ర విభజన తరువాత న్యాయవాద వృత్తిలో రవితేజ నైపుణ్యాన్ని గుర్తించిన ఏపీ హైకోర్టు ఏజీ, ఏపీ ప్రభుత్వం ఏజీపీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరి పూర్వీకులైన యధార్థుడు స్వాతంత్ర్య సమరయోధులు శుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్‌లో కర్నూలు జిల్లా నుంచి చేరిన మొదటి వ్యక్తి కావడం విశేషం. వీరి కుటుంబం వృత్తి రీత్యా ఆళ్లగడ్డ పట్టణంలో స్థిరపడ్డారు.



గుంతలమయంగా దొర్నిపాడు, ఉయ్యాలవాడ రహదారి



గుంతలు పూడ్చండి

ఉయ్యాలవాడ : మండల కేంద్రం ఉయ్యాలవాడ నుంచి దొర్నిపాడుకు వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై రెండు నుంచి మూడు అడుగుల మేర గుంతలు ఏర్పడ్డాయి. పూడ్చివేయాలని పాదాచారులు, వాహనదారులు కోరుతున్నారు. ఈ రహదారిని 2016–17లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద ఉయ్యాలవాడ నుంచి 13.25 కి.మీ. దూరంలో వున్న దొర్నిపాడును కలుపుతూ అప్పట్లో రూ.7.85 కోట్లతో నిర్మించారు. ప్రస్తుతం తారు లేచిపోయి దాదాపు 6 కి.మీ. పొడవున రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రహదారిలో నిత్యంపై వాహనాల రద్దీ ఉంటుంది. వర్షాకాలం కావడంతో గుంతల్లో నీరు నిలిచిన సందర్భాల్లో ద్విచక్ర వాహనదారులు కింద పడి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమయపాలన పాటించండి

రుద్రవరం: గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ సూచించారు. మండలంలోని ఎర్రగుడిదిన్నె గ్రామ సచి వాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. పంచాయతీ పరంగా నిర్వహిస్తున్న రికా ర్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం, వాటర్ టెస్టింగ్, క్లోరినేషన్ తదితర వాటికి ప్రత్యేకంగా రికార్డులు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. అన్ని గ్రామ పంచాయతీల్లో వెంటనే వాటర్ టెస్టింగ్ చేయించాలని ఆదేశించారు.

పదవికే రాజీనామా.. పార్టీకి కాదు



ఎంపీడీఓకు రాజీనామా పత్రాన్ని అందిస్తున్న ఎంపీటీసీ షాజహాన్

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు షాజహాన్ తన పదవికి రాజీనామా చేశారు. గురువారం కార్యాలయానికి వెళ్లి ఎంపీడీఓ శ్రీనివాసులుకు రాజీనామా పత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్నను సీఎంగా, ఎమ్మెల్యేగా బిజేంద్రారెడ్డిని మరోసారి చూడాలని అనుకున్నామన్నారు. అలాగే దొర్నిపాడు సొసైటీ ప్రెసిడెంట్‌గా భూమా చెంచిరెడ్డి కూడా తన పదవికి రాజీనామా చేశారన్నారు. వారందరికీ లేని పదవులు మాకు వద్దని, మాకు పదవులకన్నా పార్టీ శేయస్సే ముఖ్యమన్నారు. అందుకే పదవీకే రాజీనామా చేశానని పార్టీకి కాదన్నారు.

అల్లూరి పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం



ఆళ్లగడ్డలో అల్లూరి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



రుద్రవరం మోడల్‌స్కూల్‌లో అల్లూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఆళ్లగడ్డ: స్వాతంత్ర్యం, స్వయం పాలన కోసం తెల్ల దొరలపై విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని ఎంఈఓ శోభావివేకవతి కొనియాడారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని గురువారం స్థానిక ప్రభుత్వ వైపీపీఎం ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం వీర రాఘవయ్య, అపుస్మా నంద్యాల డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా ఉన్నారు.

రుద్రవరం: తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు గురువారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సీతారామరాజు ఆశయాలకు అనుగుణంగా యువత నడుకోవాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, బోధన సిబ్బంది జానా కిరణ్‌కుమార్,జాయిసి,వసుంధర,సతీష్,జ్యోత్స్న,రాజ్ నారాయణ,శిరీషబాయి, రఫి,అనురాధ, మధు, చవాన్, ఐజాక్, వెంకటరమణ,హరి,జ్యోతిప్రియ ఉన్నారు.

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ శైలజరాణి అధ్యక్షతన అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు నాగేంద్ర, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, అధ్యాపకులు దస్తగిరి, రమేష్‌కుమార్, విజయలక్ష్మి, దుర్గాప్రదీప్ పాల్గొన్నారు.



నంద్యాల డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

నంద్యాల(సిటీ): అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో మెలగాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మబున్నిసా ఆధ్వర్యంలో అల్లూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, ఇంజినీర్లు ఉన్నారు.

చాగలమర్రి: మన్యం వీరుడు, అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా గురువారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో సల్లా నాగరాజు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామతీర్థం, పీరయ్య, హుసేనయ్య, టైలర్ బాషా పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఉయ్యాలవాడ : ఉద్యానవన పంటలు సాగు చేసేందుకు సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తుందని ఉద్యాన శాఖ (ఏఈ) అధికారిణి ధరిణి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామంలో రైతు ప్రసాద్ సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్స్ పండ్ల తోటను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటలు సాగు చేసే రైతులకు నిర్వహణ కింద మూడు సంవత్సరాల పాటు వంద శాతం సబ్సిడీతో ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పెద్దయమ్మనూరులో డ్రాగన్ ఫ్రూట్స్ పంటను పరిశీలిస్తున్న ధరణి

మొక్కలతో పర్యావరణ సంరక్షణ

ఆళ్లగడ్డ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అటవీ అధికారులు శ్రీనివాసరెడ్డి, శ్రీపతినాయుడు నాయుడు అన్నారు.గురువారం 76వ వనమహోత్సవ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అహోబిలం రిజర్వ్ ఫారెస్ట్ చీతల్, పాల్కన్ బేస్ క్యాంపులు, నూతుల సెక్షన్ పరిధిలో మొక్కలు నాటారు. అహోబిలం డీఆర్వో ముర్తుజావళి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



శీతల్ బేస్ క్యాంప్ సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్‌లో మొక్క నాటుతున్న అటవీ అధికారులు

బీడుగా మారుతున్న మాన్యం

- ఆలయాల భూముల కౌలుకు వేలం వేయని అధికారులు
- రైతుల్లో ఆందోళన

రుద్రవరం: మండలంలోని పలు దేవాలయాల భూముల కౌలు వేలం నిర్వహించడంలో దేవదాయ శాఖ అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందే వేలం నిర్వహించాల్సి ఉంది. ఈ ఏడాది మండలంలోని బీరవోలు, శ్రీరంగాపురం , చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, ఆలమూరు తదితర గ్రామాల్లోని వివిధ దేవాలయాలకు సంబంధించిన భూములకు ఆయా ఈఓలు ఇదివరకే కౌలు వేలం ప్రక్రియ పూర్తి చేశారు. ఇక పేరూరు,ఎల్లావత్తుల,రుద్రవరం గ్రామాల్లో మాన్యం కౌలుకు వేలం నిర్వహించాల్సి ఉంది. ఇందులో రుద్రవరంలోని భాస్కర నందీశ్వరస్వామి ఆలయ భూములకు శుక్రవారం కౌలు వేలం వేస్తామని అధికారులు ప్రకటించారు. మిగిలిన రెండు గ్రామాల్లోని మాన్యం కౌలుకు వేలం ఎప్పుడు నిర్వహించేది ఇంకా ప్రకటించలేదు. కౌలు వేలం ఆలస్యం కావడం, ముందస్తుగా వర్షాలు కురవడంతో ఆయా భూముల్లో పిచ్చి మొక్క లు ఏపుగా పెరిగి బీళ్లుగా మారాయి. ప్రస్తుతం వాటిని కౌలుకు తీసుకుంటే గడ్డి, పిచ్చి మొక్కల తొలగింపునకు అధికంగా ఖర్చు అవ్వడమే కాకుండా విత్తనం వేసేందుకు సమయం పెరుగుతుందని రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ ఏడాది ఖరీఫ్‌కు కాస్త ముందుగానే మంచి వర్షాలు కురవ డంతో చుట్టు పక్కల రైతులు తమ పొలాల్లో సేద్యపు పనులు ముగించుకొని మొక్కజొన్న,మినుము వంటి పంటలు సాగు చేశారు. ఈ సమయంలో మాన్యం భూముల్లోకి వెళ్లేందుకు దారి సమస్యలు తలెత్తే అవకాశముంది. పైగా ఆ భూములన్నీ వర్షాధారంపైనే పంటలు పండించుకోవాల్సి ఉంది. అయితే గత నెల 25న పేరూరులో వేలం నిర్వహించగా అనివార్య కారణాలతో వాయిదా పడింది. అలాగే గత నెల 27న ఎల్లావత్తులలో వేలం నిర్వహిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ.. ఆ రోజు పోలీస్ బందోబస్తు లేదన్న సాకుతో వాయిదా వేశారు. మళ్లీ వేలం నిర్వహించే తేదీ ప్రకటిస్తామని చెప్పారే కానీ.. ఇంత వరకు ఆ ఊసే లేదు. ఇప్పటికైనా ఆ శాఖ అధికారులు స్పందించి త్వరగా కౌలు వేలం నిర్వహించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నా.ఈ విషయంపై ఆయా దేవాలయాల ఈఓ నర్సయ్యను వివరణ కోరగా త్వరలో కౌలు వేలం నిర్వహిస్తామని తెలిపారు. పేరూరు 70, రుద్రవరం 30, చిన్నకంబలూరు 20 తదితర గ్రామాల్లో దాదాపు 300 ఎకరాలకు కౌలు వేలం వేయాల్సి ఉంది. ఎల్లావత్తులలో ఈశ్వర, నరసింహ స్వామి ఆలయాలకు 50 ఎకరాలు గతేడాది వీటికి రూ.4లక్షలు లభించింది. ఈ ఏడాది రూ.6లక్షల వరకు అవకాశం ఉండేది. ఎల్లావత్తులలో మాన్యం చుట్టూ ఉండే పొలాల్లో ఇప్పటికే మొక్కజొన్న పంట మూడు అడుగులకు పైగా పెరిగిందని, వేలాలు నిర్వహించినా పంటల సాగుకు ఇక్కట్లు నెలకొనే అవకాశముందంటున్నారు.



ఎల్లావత్తులలో మాన్యం భూముల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయిన దృశ్యం

రైతులకు నాణ్యమైన విత్తనాలు

నంద్యాల(అర్బన్): విత్తన శాంపిల్స్ సేకరణను అధిగమించాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే తమ ముందున్న లక్ష్యమని నంద్యాల మండల ఏఓ ప్రసాదరావు తెలిపారు. జూన్ మాసానికి సంబంధించిన 138 శాంపిల్స్ లక్ష్యం కాగా 130 శాంపిళ్లు సేకరించామన్నారు. పట్టణ సమీపంలోని శ్రీలక్ష్మి ఆగ్రో సీడ్ విత్తన శుద్ధి కేంద్రంలో గురువారం విత్తన శాంపుల్స్‌ను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ మాసం వరకు ఖరీఫ్‌కు సంబంధించిన విత్తన శాంపిల్స్ సేకరణ ఉంటుందన్నారు. సీజన్‌ను బట్టి శాంపిళ్ల సంఖ్య హెచ్చుతగ్గులు ఉంటాయన్నారు. విత్తన శాంపిల్స్ వివరాలు ఇన్‌సైట్ యాప్‌లో నమోదు అవుతాయని చెప్పారు. తెగుళ్లు, చీడపీడల సమస్య లేకుండా విత్తనాన్ని నాణ్యతగా తయారు చేయాలని నిర్వాహకులకు సూచించారు.



విత్తన శాంపిళ్లను పరిశీలిస్తున్న ఏఓ